## క్లుప్తంగా

### ఘనంగా పెన్షనర్స్ డే వేడుకలు



సమావేశంలో మాట్లాడుతున్న పెన్షనర్ల సంఘం నాయకులు

**భద్రాచలంటౌన్:** భద్రాచలం పట్టణంలో విశ్రాంత ఉద్యోగులు సంఘం ఆధ్వర్యంలో పెన్షనర్ దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ.. నెలవారీ భత్యం రావటానికి విశేష కృషి చేసి పెన్షన్ మంజూరి చేయించిన ఘనత డీఎస్ నఖారాకే దక్కుతుందని, ఆయన సేవలను గుర్తుచేసుకుని పెన్షన్ర్స్ డేగా జరుపుకుంటారని పేర్కొన్నారు. అనంతరం సీనియర్ విశ్రాంత ఉద్యోగులు 18 మందిని శాలువలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో భూషణ్‌రావు, వెంకన్న, హనుమంత రావు, తిప్పన సిద్దులు, గోళ్ల భూపతి రావు, శరత్, విజయా రావు, జాన్ వెస్లి, అనందకుమార్, ప్రసాద్, విష్ణు రావు, మాణిక్య కుమారి, తులసీదాస్, వెంకట రెడ్డి, రమాకాంత్ తదితరులు పాల్గొన్నారు.

### సమస్యలు పరిష్కరించాలి

**ములకలపల్లి:** గ్రామ పంచాయతీల్లో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని తెలంగాణా ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు గౌరి నాగేశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం సంఘం ఆధ్వర్యంలో తిమ్మంపేటలో ప్రదర్శన నిర్వహించారు. జీపీ కార్యాయలంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ .. గ్రామ పంచాయతీల అభివృద్ధికి నిధులు కేటాయించాలని అన్నారు. జీపీ కార్మికులకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని, రేషన్‌కార్డులు, పెన్షన్ సౌకర్యం కల్పించాలన్నారు. గౌరి లక్ష్మి, రాజనేని రాజు, రావుల పుల్లయ్య, కాకర్ల సుధాకర్, సాయి కిరణ్, సత్యావతి, భవాని, సమ్మక్క తదితరులు పాల్గొన్నారు.

### పింఛన్లు మంజూరు చేయాలని వినతి



ఎంపీడీఓ అశోక్‌కు వినతిపత్రం అందిస్తున్న బాలాజీనాయక్

**చండ్రుగొండ:** పెన్షన్లకు అర్హులైన కొత్త వారు దరఖాస్తు చేసుకునేందుకు ఆన్‌లైన్‌లో సైట్ ఓపెన్ చేయాలని గిరిజన విద్యార్థి సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి మూడ్ బాలాజీనాయక్ శుక్రవారం ఎంపీడీఓ బయ్యారపు అశోక్ వినతిపత్రం అందించారు. మండలంలో అనేక మంది అర్హులైన వారు వితంతువులు, వికలాంగులు, వృద్ధులు పింఛన్ల కోసం ఎదురుచూస్తున్నారని ఆయన పేర్కొన్నారు. ఎన్నికల హామీ ప్రకారం పెంచుతామన్న పెన్షన్ మొత్తం ఇవ్వాలన్నారు.

### కాసాని సంతాప సభ



కాసాని చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

**బూర్గంపాడు:** సీపీఎం సీనియర్ నాయకులు కాసాని ఐలయ్య సంతాప సభను గురువారం సారపాకలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా కాసాని చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ పార్టీ అభ్యున్నతికి, ప్రజా సమస్యల పరిష్కారానికి కాసాని చేసిన సేవలను గుర్తుచేశారు. పాండవుల రామనాథం, ఎస్‌కె.అబీదా, కనకం వెంకటేశ్వర్లు, కందుకూరి నాగేశ్వరరావు, ఎస్‌కె.పాషా, పాపినేని చందర్‌రావు పాల్గొన్నారు.

### లక్కీ డ్రా విజేతలకు ఎలక్ట్రిక్ బైక్‌లు

**మణుగూరుటౌన్:** పట్టణంలోని వీ గ్రాండ్ హోటల్‌లో గతేడాది 11వ నెల నుంచి సేకరించిన రశీదులతో లక్కి డిప్ కార్యక్రమాన్ని శుక్రవారం సాయంత్రం నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ హోటల్స్ అసోసియేషన్ ఎగ్జిక్యూటీవ్ మెంబర్ లక్కా లక్ష్మీనారాయణ, వర్తక సంఘం అధ్యక్షుడు దోసపాటి నాగేశ్వరరావు, ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు వెంకట్‌లు లక్కి డిప్ ద్వారా విజేతలను ప్రకటించారు. విజేతలైన లక్ష్మీపురం నకు చెందిన చిన్నరెడ్డి, మణుగూరుకు చెందిన వెచ్చా చంద్రశేఖర్, డీఎస్‌ఆర్‌లకు వీగ్రాండ్ యజమాని వందనపు వాసు పంపిణీ మూడు ఈకో తేజాస్ ఎలక్ట్రిక్ బైక్‌లు అతిథులు అందజేశారు. అతిథులు మానిక రెడ్డి, రామకృష్ణ, మారుతి శ్రీనివాస్, సాబీర్‌పాషా, శ్యామ్, హనుమాన్ పాల్గొన్నారు.

# వెలుగులు ఎన్నడో..?

## నత్తనడకన సెంట్రల్ లైటింగ్ పనులు

- రాత్రి వేళలో వాహనదారుల ఇబ్బందులు
- పట్టించుకోని అధికారులు





రోడ్డు పక్కన లైటింగ్ నిమిత్తం వేసిన స్తంభాలు

**పినపాక:** తెలంగాణ ఏర్పడ్డాక పినపాక-మణుగూరు మండలాల సరిహద్దులో భద్రాద్రి పవర్ స్టేషన్‌ను అప్పటి బీఆర్‌ఎస్ ప్రభుత్వం నిర్మించింది. ఆ ప్రభుత్వ హయాంలోనే భద్రాద్రి పవర్ ప్లాంట్ నిధులతో మణుగూరు నుండి జానంపేట వరకు ప్రధాన రహదారికి సెంట్రల్ లైటింగ్ పేరుతో మూడు కోట్ల నిధులు మంజూరు చేశారు. నిధులైతే మంజూరైనా పనులు పూర్తి కాకపోవడంతో వాహనదారులు చీకట్లోనే ఇబ్బంది పడుతూ ప్రయాణం సాగిస్తున్నారు.

**పనులు సా..గుతున్నాయి..**

గత ప్రభుత్వ హయాంలో 2023లో బీటీపీఎస్ పరిధిలో ఉన్న గ్రామాల అభివృద్ధి నిధుల నుండి సెంట్రల్ లైటింగ్‌కు నిధులు మంజూరు చేశారు. ఏళ్లు గడుస్తున్న ఎక్కడ పనులు అక్కడే ఉన్నాయి. మణుగూరు నుంచి జానంపేట వరకు రోడ్డు పక్కన కరెంటు స్తంభాలు, వైర్లు, లైటింగ్ ఏర్పాటుచేసిన అవి వెలగడం లేదు. అయినా అధికారులు పట్టించుకోట్లేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి.

**తప్పని తిప్పలు..**

మణుగూరు–ఏటూరునాగారం ప్రధాన రహదారి కావడంతో నిత్యం వందల సంఖ్యలో వాహనాలు రహదారిపై రాకపోకలు సాగిస్తుంటాయి. పవర్‌ప్లాంట్‌కు బొగ్గు సరఫరా చేసే లారీలు కూడా ఈ రహదారిపై వెళ్తుంటాయి. రాత్రి వేళల్లో ద్విచక్ర వాహదారులు, ఆటో డ్రైవర్లు రహదారిపై లైట్లు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చీకటిలో ఏ వాహనం ఎటో వస్తుందోనని అర్థం కావట్లేదని వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా అధికారులు పట్టించుకుని పనులు పూర్తి చేయాలని కోరుతున్నారు.

**త్వరగా పూర్తి చేయాలి**

మణుగూరు జానంపేట వరకు మంజూరు చేసిన సెంట్రల్ లైటింగ్ పనులు త్వరగా పూర్తి చేయాలి. రోజు రాత్రి వేళలో మణుగూరు వెళ్లాలంటే ఎదురుగా వస్తున్న వాహనాలు కనబడట్లేదు. అధికారుల స్పందించి త్వరగా పూర్తి చేయాలి.

– సంతోష్, ఆటో డ్రైవర్, బయ్యారం

**ఇబ్బందులు పడుతున్నాం**

ద్విచక్ర వాహనంపై మణుగూరు వెళ్లి రావాలంటే ఎదురుగా వచ్చే వాహనాలు కనబడటం లేదు. లైట్ లేక రోడ్డు కనపడతాయి ఇబ్బంది పడుతున్నాం. వెంటనే పనులు పూర్తి చేసి లైట్లు వెలిగేలా చూడాలని కోరుతున్నాం.

– సమీర్, దమ్మక్కపేట

## ఉచితంగా కళ్లద్దాల పంపిణీ



కళ్లద్దాలను పంపిణీ చేస్తున్న ఏరియా జీఎం రామచందర్

**మణుగూరురూరల్:** కంటి వైద్యచికిత్సలు పూర్తి చేసుకున్న రామానుజవరం, విజయనగరం, బెస్త గూడెం గ్రామాల బాధితులకు సింగరేణి వైద్య, ఆరోగ్య విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం మణుగూరు ఏరియా సింగరేణి జీఎం దుర్గం రామచందర్ ఉచితంగా కళ్లద్దాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సామాజిక బాధ్యతలో భాగంగా సింగరేణి యాజమాన్యం సింగరేణి ప్రభావిత, పరిసర గ్రామాల్లో లక్షల నిధులను ఖర్చు చేసి మౌలిక సదుపాయాలను కల్పిస్తోందని అన్నారు. అలాగే గ్రామాల్లో వైద్యశిబిరాలు నిర్వహించి ప్రజలకు వైద్యసేవలు అందిస్తోందన్నారు. కంటి సమస్యలతో బాధపడుతున్న 130మందికి హైదరాబాద్ వారి పుష్పగిరి కంటి ఆస్పత్రి సౌజన్యంతో కంటి వైద్య చికిత్సలు అందించడమే కాకుండా రూ.1.50లక్షలతో నాణ్యమైన కళ్లద్దాలను అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏరియా ఎస్‌ఓటు జీఎం డి.శ్యాంసుందర్, మణుగూరు ఓసీ పీఓ శ్రీనివాసచారి, డీజీఎం(పర్సనల్) ఎస్.రమేష్, సింగరేణి వైద్యులు శేషగిరిరావు, ప్రభుత్వ కంటి వైద్యులు జి.సంజీవరావు, డీవైపీఎం పీబీ అవినాష్, సీపీఐ రాష్ట్ర నాయకుడు బి.అయోధ్య, రామానుజవరం మాజీ సర్పంచ్ బాడిశ సతీష్, తిర్లాపురం మాజీ సర్పంచ్ పాయం కామరాజు, సింగరేణి ఆస్పత్రి మ్యాట్రిన్ సారహ్, తదితరులు పాల్గొన్నారు.

## విగ్రహ ప్రతిష్ఠాపనలో ఎమ్మెల్యే



విగ్రహ ప్రతిష్ఠాపనలో పాల్గొన్న ఎమ్మెల్యే జారే ఆదినారాయణ

**దమ్మపేట:** మండలంలోని పట్వారిగూడెం గ్రామంలో నూతనంగా నిర్మించిన శివాలయంలో నిర్వహిస్తున్న విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే జారే ఆదినారాయణ శుక్రవారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన ధ్వజస్తంభ, నవగ్రహాల ప్రతిష్ఠాపన కార్యక్రమాల్లో ఎమ్మెల్యే జారే ముఖ్య అతిథిగా పాల్గొని, ప్రత్యేక పూజ కార్యక్రమాలను నిర్వహించారు. దమ్మపేటలో స్థానిక న్యాయవాది లక్కినేని నరేంద్రకు చెందిన లీగల్ కన్సల్టెన్సీ కార్యాలయాన్ని ఎమ్మెల్యే చేతుల మీదుగా ప్రారంభించారు. అనంతరం మండల పరిధిలోని పలు గ్రామాల్లో శుభ కార్యక్రమాలకు హాజరయ్యారు. ఈ కార్యక్రమాల్లో ఎమ్మెల్యేతో పాటుగా పలువురు ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## 10న నులిపురుగుల నివారణ దినోత్సవం

**చండ్రుగొండ:** ఈ నెల 10వ తేదీన నిర్వహించనున్న జాతీయ నులిపురుగులు నివారణ దినోత్సవాన్ని విజయంతం చేయాలని ఎంపీడీఓ బయ్యారపు అశోక్ కోరారు. ఈ మేరకు కార్యాలయంలో వివిధ శాఖాధికారులతో శుక్రవారం సన్నాహక సమావేశం ఏర్పాటు చేశారు. 19 సంవత్సరాల లోపు వయస్సు ఉన్న పిల్లలందరికీ నులిపురుగులు వేయాల్సి ఉంటుందన్నారు. మండలంలో 4,276 పిల్లలను గుర్తించినట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్‌ఎంలు, ఆశావర్కర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొంటారన్నారు. ఈ సమావేశంలో డాక్టర్ కనకం తనుజా, ఆర్‌ఐ అక్బర్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాణి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ అశోక్

## కూలి రేట్లు పెంచాలని ధర్నా



క్రాస్ రోడ్డులో ధర్నా నిర్వహిస్తున్న మహిళా కూలీలు

**పినపాక:** మండలంలోని రైతులు కూలి రేట్ల పెంచాలని వ్యవసాయ కూలీలు శుక్రవారం బయ్యారం క్రాస్ రోడ్‌లో ధర్నా నిర్వహించారు. ముందుగా ఇతర ప్రాంతాల నుంచి వచ్చే కూలీలను పొలాల్లోకి వెళ్లకుండా అడ్డుకున్నారు. అనంతరం బయ్యారం క్రాస్ రోడ్‌లో ధర్నా చేపట్టారు. కూలీలకు కార్మిక సంఘం నాయకులు మద్దతుల తెలిపారు. రోజురోజుకూ నిత్యవసర ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయని, కూలి రేట్లు మాత్రం ఏమాత్రం పెంచడం లేదని అన్నారు. అనంతరం వ్యవసాయ శాఖ అధికారులు, రెవెన్యూ అధికారులకు వినతిపత్రం అందజేశారు.

### బయ్యారం ఎఫ్‌ఆర్‌ఓగా తేజస్విని



**పినపాక:** ఈ బయ్యారం ఎఫ్‌ఆర్ ఓగా తేజస్విని శుక్రవారం అటవీ శాఖ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఎఫ్‌ఆర్ ఓగా విధులు నిర్వహించి సెలవులపై వెళ్లిన ఆమె,, పూర్తిస్థాయి బాధ్యతలు స్వీకరించారు. మణుగూరు ఎఫ్‌ఆర్‌ఓగా విధులు నిర్వహిస్తున్న ఉపేంద్ర ఇన్ని రోజులు ఇన్‌చార్జ్‌గా విధులు నిర్వహించారు.

### నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

**ములకలపల్లి:** ములకలపల్లి మండల కేంద్రంతోపాటు, పాగళ్లపల్లి, జగన్నాథపురం గ్రామాల్లో నేడు విద్యుత్ సరఫరా నిలిపి వేయనున్నట్లు ట్రాన్స్–కో ఏఈ బి.నరేశ్‌కుమార్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకూ విద్యుత్ కోత విధించనున్నామని, వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

**దమ్మపేట:** మండలంలోని లింగాలపల్లి, నాయుడుపేట సబ్‌స్టేషన్‌ల పరిధిలోని విద్యుత్ సరఫరాలో నేడు(శనివారం) అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్‌శాఖ ఏడీఈ వెంకటరత్నం శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.లింగాలపల్లి 33 కేవీ ఫీడర్ మరమ్మత్తుల కారణంగా నేడు ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు సబ్ సబ్‌స్టేషన్‌ల పరిధిలోని గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేయబడినని తెలిపారు. ఈ విషయాన్ని వినియోగదారులు గమనించి విద్యుత్ సిబ్బంది సహకరించాలని ఏడీఈ ఈ సందర్భంగా కోరారు.

### క్యాలెండర్ల ఆవిష్కరణ

**మణుగూరురూరల్:** సింగరేణి గిరిజన ఉద్యోగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ముద్రించిన నూతన సంవత్సరం క్యాలెండర్‌ను మణుగూరు ఏరియా జీఎం కార్యాలయ ఆవరణలో జీఎం దుర్గం రామచందర్ చేతుల మీదుగా శుక్రవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఏరియా ఎస్‌ఓటు జీఎం డి.శ్యామ్‌సుందర్, కేసీహెచ్‌పీ ఇన్‌చార్జ్ డీజీఎం మధుసూధన్ నాయక్, ఏరియా ఇంజనీర్ శ్రీనివాస్, డిజిఎం (పర్సనల్) ఎస్.రమేష్, ఎస్టీ లైజన్ అధికారి ఇస్లావత్ సతీష్‌కుమార్, దశత్, కృష్ణ, హరిలాల్, జగన్, రామదాస్, నాగేందర్, కిరణ్, బాలాజీ, హరినాయక్, సురేష్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

### వైద్య శిబిరం తనిఖీ



పశు వైద్య శిబిరాన్ని సందర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే మెచ్చా

**దమ్మపేట:** మండల పరిధిలోని తాటి సుబ్బన్నగూడెం గ్రామంలో ఉచిత పశు వైద్య శిబిరాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ శిబిరాన్ని బీఆర్ఎస్ జిల్లా నాయకుడు, మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అనారోగ్యంతో బాధపడుతున్న పశువులకు అవసరమైన అన్ని రకాల మందులను అందుబాటులో ఉంచాలని నిర్వాహకులకు సూచించారు. వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని గ్రామస్తులకు సూచించారు.

## ముమ్మరంగా వాహన తనిఖీలు



ద్విచక్ర వాహనదారులను తనిఖీ చేస్తున్న పోలీసులు

**దుమ్ముగూడెం:** మండలంలోని మహాదేవపురం గ్రామ శివారులో ఎస్ఐ వెంకటప్పయ్య తన సిబ్బందితో శుక్రవారం ముమ్మరంగా వాహన తనిఖీలు చేపట్టారు. మారాయిగూడెం నుంచి ములకపాడు వైపు వచ్చే వాహనాలను ఆపి నిశితంగా తనిఖీలు చేపట్టారు. మారాయిగూడెం–ములకపాడు రహదారి మీదుగా గతంలో పలుమార్లు గంజాయి తరలిస్తూ కొంత మంది వ్యక్తులు పట్టుబడిన ఘటనలు తెలిసిందే. ఈ నేపథ్యంలో ఛత్తీస్‌గఢ్, ఒరిస్సా రాష్ట్రాల నుంచి ఈ గ్రామాల మధ్య ప్రయాణించే వాహనాలను తనిఖీలు చేశారు. అలాగే ఛత్తీస్‌గఢ్ దండకారణ్యానికి సరిహద్దు మండలం కావడంతో మావోయిస్టులు, కొరియర్‌లు, మిలీషియా సభ్యుల సంచారంపై అనుమానిత వ్యక్తులను అదుపులోకి తీసుకుని ప్రశ్నించి వదిలేస్తున్నారు.

## కమ్యూనిటీ హెల్పర్స్ కార్యక్రమం



స్టాళ్లను పరిశీలిస్తున్న కమిషనర్, సూపరింటెండెంట్

**మణుగూరుటౌన్:** పట్టణంలోని సుందరయ్యనగర్‌లో ఉన్న బ్రైట్ మైండ్స్ ప్లే స్కూల్‌లో కమ్యూనిటీ హెల్పర్స్ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా స్కూల్ యాజమాన్యం విద్యార్థులకు సమాజంలో కీలక విభాగాల్లో పనిచేసే అధికారులను వల్ల కలుగుతున్న మేలును వివరించారు. ఈ సందర్భంగా మున్సిపాలిటీ అధికారులు, వైద్య, లాయర్, పాత్రికేయ, ఫైర్, పోలీసు, పోస్టాఫీస్, విభాగాల నుంచి అతిథులుగా హాజరై విద్యార్థులు రూపొందించిన కమ్యూనిటీ హెల్పర్స్ స్టాల్స్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా చిన్నారుల కమ్యూనిటీ హెల్పర్స్ వేషధారణలు ఆకట్టుకున్నాయి. అనంతరం విద్యార్థులకు పతకాలు అందజేశారు. మున్సిపాలిటీ కమిషనర్ ప్రసాద్, 100 పడకల ఆస్పత్రి సూపరింటెండెంట్ సునీల్ అతిథులుగా పాల్గొనగా.. వారిని పాఠశాల మెనేజ్‌మెంట్ రాంబాబు, రమ, గ్రీష్మ, ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కవిత, వినోద్‌కుమార్, నరేశ్, మధు, రైతు జగన్నాథం, నర్సు సుమలత, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## బాలమేళా బృందం పరిశీలన



విద్యార్థుల నైపుణ్యాన్ని పరీక్షిస్తున్న బాలమేళా బృంద సభ్యులు

**మణుగూరురూరల్:** మండల పరిధిలోని తోగ్గూడెం గ్రామపంచాయతీలో ఉన్న ప్రాథమిక పాఠశాలను ఎఫ్‌ఎల్‌ఎస్ బాలమేళా బృందం వారు శుక్రవారం సందర్శించారు. తరగతి గదుల్లో విద్యార్థులు సంపాదించిన జ్ఞానాన్ని, నైపుణ్యాన్ని, సృజనాత్మకత ప్రతిభ వంటి అంశాలను బాలమేళా బృంద సభ్యులైన కాంప్లెక్స్ హెచ్‌ఎం జి.నాగశ్రీ, కాంప్లెక్స్ అసిస్టెంట్ కార్యదర్శి బి.కిషోర్, సీఆర్‌పీ లక్ష్మణ్‌లు క్షుణ్ణంగా పరిశీలించారు. తరగతుల వారీగా ఉత్తమ విద్యార్థులను ఎంపిక చేసి, తగిన తర్ఫీదు ఇవ్వాలని, త్వరలో జరగబోయే కాంప్లెక్స్ మేళాకు తీసుకురావాలని ప్రధానోపాధ్యాయులకు సూచించారు. కార్యక్రమంలో బాలమేళా బృంద సభ్యులు.. పాఠశాల హెచ్‌ఎం దబ్బారి రావవవు, ఉపాధ్యాయులు సింగా రవిబాబు, తుర్రం శారద, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## సమస్యలు పరిష్కరించాలి



వినతిపత్రం అందజేస్తున్న వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు

**దమ్మపేట:** ఉపాధి హామీ కూలీల సమస్యలను సత్వరమే పరిష్కరించాలని కోరుతూ.. కొత్తగూడెం జిల్లా కలెక్టరేట్‌లో అఖిల భారత ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి అమర్లపూడి రాము ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉపాధి హామీ కూలీ పని చేస్తున్న ప్రతి ఒక్కరికీ 12 వేల రూపాయల జీవన భృతి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఉపాధిహామీ కూలీ పని చేసే ప్రదేశాల్లో నీడకు అవసరమైన టెంటు, తాగునీరు, మెడికల్ కిట్లు తదితర అత్యవసరాలను ఏర్పాటు చేయాలని అన్నారు. పని దినాలను 200 రోజులకు పెంచి, కొలతలతో నిమిత్తం లేకుండా రోజుకు 600 రూపాయల కూలీని ఇవ్వాలని డిమాండ్ చేశారు.

ఈ కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి పోతుగంటి లక్ష్మణ్, బుర్ర వెంకన్న, దాసరి సాయి, వెంకటేశ్వరరావు, తెల్లం రాజులు తదితరులు పాల్గొన్నారు.

## క్షయ వ్యాధి నిర్మూలనే లక్ష్యం

**పినపాక:** 2025 నాటికి క్షయ నిర్మూలనే లక్ష్యంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ముందుకు సాగుతున్నాయని పినపాక ప్రభుత్వ వైద్యురాలు దుర్గ భవాని అన్నారు. ఈ మేరకు శుక్రవారం మండల పరిధిలోని ఎల్చిరెడ్డిపల్లి గ్రామంలో ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. క్షయ అంటువ్యాధి కావడంతో ఒకరి నుంచి మరొకరికి సోకకుండా స్వీయ నియంత్రణ పాటించాలని కోరారు. అందుకు అనుగుణంగా వందరోజుల ప్రణాళిక తయారు చేశామని, తద్వారా గ్రామాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేస్తామని అన్నారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.



గ్రామస్తులకు పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

## అమ్మవారికి మంగళ స్నానం

**దుమ్ముగూడెం:** దుమ్ముగూడెం గ్రామంలోని ముత్యాలమ్మ జాతరలో భాగంగా 5వ రోజు శుక్రవారం అమ్మవారికి 101 బిందెలతో మంగళ స్నానం చేయించారు. ఆడపడుచులు తమ ఇళ్ల వద్ద నుంచి బిందెలతో నీళ్లను తీసుకునివచ్చి ఆలయం పక్కన ఉన్న మర్రిచెట్టు వద్ద అమ్మవారికి అభిషేకం చేశారు. అనంతరం దేవస్థానం ఆధ్వర్యంలో మహిళలకు అమ్మవారి తాంబూలాలైన పసుపు, కుంకుమ, గాజులు జాకెట్ ముక్కలను ప్రసాదాలను ఆడపడుచులకు అందించారు. కాగా, అమ్మవారిని భద్రాచలం శ్రీ సీతారామదేవస్థానం ఆలయ ఈఓ ఎల్.రమాదేవి దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు భారీగా ఆలయానికి తరలివస్తున్నారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు చుక్క గణేష్ రెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు ప్రత్యేక ఏర్పాట్లను చేపట్టారు.



అమ్మవారి సన్నిధిలో సీతారామచంద్రస్వామి దేవస్థానం ఈఓ రమాదేవి



101 బిందెలతో ఆలయానికి వచ్చిన భక్తులు